ఇల్లాలు

మల్లాది రామకృష్ణశాస్త్రి గారు

౧

'ఏపరావచ్చేది...ఏమేయ్...చూడు, మనఅల్లుడి లాగున్నాడు...'అన్నాడు అప్పిరెడ్డి.

...రత్తమ్మ గుమ్మందిగి ముందుకువచ్చి నిదానించి చూసి...'అవును మన రామయ్యే...దానిమీంచి లేండి...కూర్చుంటాడు...'అని మాట్లాడుతూనే లోపలికివెళ్లిపోయింది.

'ఏమయ్యోవ్...రా...ఇలా కూర్చో...'అని అప్పిరెడ్డి కొంచెంపక్కగాజరిగి అల్లుడికి చోటు చూపించాడు మంచంమీద. రామిరెడ్డి చేతికర్ర అరుగుకుఆనించి, మెట్లక్రిందుగా చెప్పులువిడిచాడు... రత్తమ్మ నిలువుచెంబుతో నీళ్లుపట్టుకునివచ్చి అరుగు చివరగా పెట్టి లోపలకువెళ్లి తలుపోరగానిలుచున్నది.

'ఇంటిదగ్గర అందరూ క్షేమమేనా?...చాలా పొద్దెక్కి బయదెల్లినట్టుందే...' అని అడిగింది రత్తమ్మ. 'ఆ...అందరూబాగానేఉన్నారు...ఈ మధ్దెను...ముసలమ్మకు జబ్బు చేసింది...నాలుగు రోజులు ధారకమేలేదు...కటికిలంకణం...ఇప్పుడు కాస్తనింపాదే' అని రామిరెడ్డి జవాబుచెప్పాడు.

'ఓపాయఇట్టాఅందుకో'...అనిఅప్పిరెడ్డి భార్యను కేకవేశాడు...రత్తమ్మ పొగాకూ, అగ్గిపెట్టె తెచ్చి యిచ్చింది. ఆతడు సావకాశంగా చుట్టచుట్టుకుని, ముట్టించి అక్కడనుంచిలేచాడు.

'చేనుకాడికి వెళుతుండావా? మామా!... నేను కూడారానా?' అన్నాడు రామిరెడ్డి.

'నీవెందుకులేవయ్యా...నడిచినడిచివచ్చావు... ఆయన్ని వెళ్లిరాని...ఇదుగో...అక్కడేకూర్చోకే... కుప్పపడవోయించి ఇంటికిరాండి. మళ్లా ఆనికె వెళుదురుగాని...'అన్నది రత్తమ్మ.

'సరేలే... నేనిట్టెతిరిగివస్తానుకాని...నీవు కాస్సేపు పండుకోవయ్యా...మరే...ఇదుగో నేవ్! పిల్లకాడ్నె పర్నయినాపంపి...పొట్టిబామ్మడిచేలో, వంగ పిందెలున్నాయి పట్టుకొమ్మను...అంజిగాడు జనప కట్టలు కడుతున్నాడుకామోలు...' అని అప్పిరెడ్డి వెళ్లిపోయినాడు.

* * * *

'ఏమోనమ్మ ఎక్కడకుపోతుందో...అస్తమానం ఆ ఇల్లు ఆ ఇల్లూ పట్టుకుతిరగడమేకద!... మొగుడు వచ్చినా ఇంట్లోఉండదాయెను...ఇదుగో సుబ్బమ్మా! అక్కడెక్కడన్నా మాపిల్లుంటేపంపమ్మ...ఏమేవ్! అమ్మాయీ!' అనిరత్తమ్మ కూతురినిపిలువడం మొదలు పెట్టింది...దొడ్డివేపు గుమ్మందగ్గర నుంచుని... 'అమ్మాయ్...ఓ...అమ్మాయ్...అబ్బ ఎక్కడకు పోతుందోనమ్మ ఇట్టేమాయమౌతుంది...అమ్మాయ్'.

'ఎందుకే అలా కేకలేస్తావు...వస్తూంటినిగా...' అన్నది కనకం.

'ఏంరావడం...ఎంతసేపటినుంచి పిలవడం... ఎక్కడికివెళ్లావే?'

'ఇప్పుడేకాదటే...వాళ్లలక్ష్మమ్మ వెళ్లిపోతూందని చూడటానికి డాబా కోటయ్యగారియింట్లోకి వెళ్ళాను...,ఇంతలో ఏంపనివచ్చిందమ్మ?'

'ఏంపనా?...నీవు నాకు పనీ చేయక్కర్లేదు, పాటా చేయక్కర్లేదు...ఇంటోఉందూ చాలు...ఎవరొచ్చారో తెలుసునా?'

'ఎవరు?'

'ఎవరో...చూడు...పందిట్లో...'అని రత్తమ్మ నవ్వింది...కనకంగ్రహించి సిగ్గుపడి తలవంచుకుంది.

* * * *

'ఎక్కడకూర్చుంటే అక్కడేనాయెను...రెండు జాములుతిరిగింది. మీనాయన ఇంకా జాడాజవాబు లేదు. పోనీ ఆయనకుపెడతాను తింటాడేమో కనుక్కోవే, అమ్మాయ్'!

కనకం వినిపించుకోనట్లూరుకుంది.

'నిన్నే నే...అన్నంకంచంలో పెడుతున్నాను... కాస్తపిలవవే...' అనిరత్తమ్మ బిగ్గరగా కేకవేసింది.

'అబ్బ...ఏమిటే...నీవుపిలువరాదా?'

'ఎంతసిగ్గేఅమ్మ...మాటాడకుండానే మొగుడితో కాపురంచేస్తున్నావా?...రేపు మీ ఊరు వెళితే... అక్కడా నేనేవస్తానా...పిలవడానికి.'

'చాల్లేవే...నీమాటలు...మరీనేర్చుకుంటున్నావు. నీవుపిలవరాదేం...మీఇంటికా బంధువులొచ్చింది... మాయింటికా?'

'అవును లే అమ్మ... నే నేపిలుస్తాను...మాయింటికే వచ్చింది బంధువులు...మాఅమ్మాయిమొగుడొచ్చాడు...మాబంధువుణ్ణి పలుకరించావాఅంటే చూడు చెపుతా...' అని నవ్వుకుంటూ రత్తమ్మ వెళ్లిపోయింది.

౨

'ఏమంటావు మామా!'

'అబ్బ! ఉండవయ్యా...ఇప్పుడే తిరిగితిరిగొచ్చాను...తెల్లారి అడుగకూడదూ...లే...భోంచేతాము.'

'కాదుగాని... నేను చెప్పేమాటవిందూ...మళ్ళా తెల్లారాఅంటే, నీవు కోడికూయకముందే లేచి పొలమెళుతావు...మాఅత్తాఅంటే ఏంచెప్పినా వినిపించుకోదు...మరి నాసంగతికూడాఆలోచించు...ఒంటరికాడ్ని.'

'అయితే...పదిరోజులుపాటన్నా ఉండకుండా అప్పుడే ఏమంతతొందరవచ్చింది? పండగ ఇంకా ఎన్నాళ్ళుంది?...పౌర్ణమి ఎల్లుండి కాదూ...రేపు వారంకాక, ఆపైమంగళవారమేకాదూ? ఇంతలో ముంచుకుపోయేదేముంది?...లే...పొద్దోతూంది.'

* * * *

'ఏమే అమ్మాయి!—మీఆయన ఏదిపడితే అదే పట్టా! చెపితేవినడే...నిన్నుతీసుకువెళ్ళడానికి వచ్చాడుట...పోనీ నీవన్నా చెప్పరాదుటే...అప్పుడే ఏం తొందరవచ్చింది...మరి నాలుగురోజులుపాటు ఉండనీయమని.'

'...............'

'ఏమాటకీ సమాధానంచెప్పకుండా ఊరుకుంటావు ఏలానే... నేనుచెపుదామా పోనీఅంటే, మీనాయన మాటే లక్ష్యపెట్టడాయెను...మీరిద్దరూ ఏమాలోచించుకున్నారు?'

'...............'

'ముద్దరాలుపుట్టిన మూడోనాడు పుట్టావాయెను. ఏమాటకీ అవుననవు...కాదనవు...ఏలాచెప్పమరి... ఏమోనమ్మ...నాకుమటుకు...మీరు ఇప్పుడువెళ్లడం సుతరాం ఇష్టములేదు.'

* * * *

'రేపు తెల్లారగట్టే వెళ్ళిపోతామంటున్నాడే... అల్లుడు...ఏమంటావు?'

'ఏమంటాను...మధ్య నా నోరు ఖాళీ అవటమే కాని...వద్దంటే మానుకుంటాడా.'

'వద్దనడమెందుకూ...ఇవాళకాకపోయినా మరి నాలుగునాళ్ళుతాళినా...వాళ్ళయింటికి వాళ్ళు వెళ్ళాలిసిందేకాదూ...నీవు అడ్డంచెప్పమాక.'

'మీతీర్పు ఇదేనా...లక్షణంగా...పండగపూట పిల్ల నట్టింటఉండకుండా...ఇన్నాళ్ళూఉండీ తీరా ఇప్పుడు వెళ్ళడమేమిటీ?'

'ఏమోవాళ్ళయిష్టం...వెళ్లిరానీ...అయినా, ఇంతకూ అమ్మాయి ఏమంటుంది...దాన్ని కనుక్కున్నావా?'

'ఏంకనుక్కోను...ఏమాటకీ మెదలకుండా ఊరుకుంటుంది—ఏమో, ఇద్దరూ ఆలోచించకుండా ఉన్నారూ?..మనం ఎన్ని చేసినా...ఎంతపెట్టినా... మనమీదఎందుకుంటుంది దానికి అపేక్ష...ఎప్పుడు దూనుకుందామాఅని...ముండ్లమీదకూర్చున్నట్లుంది.'

'అవునే...లేకపోతే ఎల్లకాలం నిన్నుకనిపెట్టుకుని కూర్చోమన్నావాఏం...నాకుమాత్రం పిల్లఉండటంచేదా...మనం ఎన్నాళ్ళుపెంచితేనేం...పరాయివాళ్ళపిల్ల...ఆడపిల్లనగానే ఇంకోరిసొత్తు...వెళ్ళేది ఎక్కడికీ కానిపోనిచోటికా...దానియింటికి అది వెళుతుంది...మధ్యన మనమెవరం?'

'ఆ...దానియిల్లు...ఇల్లంటూ అక్కడుంది.అన్నగారితో పోట్లాడివచ్చాడట... నేను విన్నానులే... దీన్ని తీసుకువెళ్ళి వేరుకాపురంపెడతాడుకాబోలు

చిన్నతనం...దాని మొహం...ఇప్పటినుంచీవెళ్ళి ఒంటరికాపురం ఏంచేయగలదు? అందులో ఇదే తొలిసారాయెను వెళ్ళడం?'

'ఆడపిల్లయినతరువాత, పనీపాటా చేయకుండా తప్పుతుందీ...మనకంటే మహామహావాళ్ళు చేసుకుంటున్నారు...మనపంతులు బావమరది...సూరయ్యగారికూతురు...చిన్నపిల్లేకాదూ...ఒక్కత్తెఉండి చేసుకోడంలా?...వారికన్న మనమేం...ఎక్కువ?'

'సరే...మీయిష్టం...అయినా మీరు కనుక్కోరాదూ...మీరుచెపితే వింటాండేమో.'

'మళ్ళా మొదలా...ఇక మాటాడమాకనీవు.'

*   *   *   *

తూర్పు తెల్లవారుతూంది.

'ఒరేయ్ అంజిగా! పొద్దెక్కిపోయె...పొద్దెక్కిపోయె. త్వరగాబండికట్టరా...అగెవద్దు...దాపట ఆ బక్కదాన్ని కట్టు...కానీరా, జాము న్నర చేస్తున్నావు...మళ్ళా ఎండెక్కుతుంది...' అని అప్పిరెడ్డి ప్రయాణానికి ప్రయత్నాలుచేస్తున్నాడు...రత్తమ్మ కూతురిసామానులన్నీసర్ది, ఒక్కొక్కటే నడవలోకి తీసుకునివచ్చి పెడుతూంది...అంజిగాడు అవన్నీ బండిలోకి ఎక్కిస్తున్నాడు...రామిరెడ్డి ఉత్తరీయం వేసుకుని చెప్పులుతొడుగుకుని యింటిముందు అటు ఇటు పచారుచేస్తూన్నాడు.

అందరితోనూ...వెళ్ళివస్తానని చెప్పి కనకం బండి ఎక్కింది...రత్తమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నది...ఆమెనుచూసి చూడవచ్చినవాళ్ళందరూకూడా కళ్ళు తుడుచుకున్నారు.

'ఎందుకే అమ్మా...! నీవురాలేదుటే...ఆలాగే నేనూ వెళుతున్నామాయింటికి...' అన్నది కనకం బండిలోంచి...వచ్చేకన్నీరు ఆపుకుంటూ.

అప్పిరెడ్డి చలించిపోయినాడు...కాని బయటికి మాత్రం తొణకకుండా...'కానీ...ఇక బండిసాగనీయండ్రా.' అని కేకవేశాడు తన ఉద్వేగం ఎవరూ గ్రహించకుండాఉండాలని.

'కనుమునాటికి మళ్ళాపంపునాయనా!...ఏమో..ఇక మీపిల్లేఆయెను...ఎన్నడన్నా...నీదయవచ్చి పంపితే కళ్ళచూస్తూంటాము' అని వెనుకనుంచి కేక వేసింది గాద్గదికంతో రత్తమ్మ.

3

'వెల్లావుపాలుతీసావా?'

'లేదు'

'ఏం?'

'నిన్న తీస్తేతన్నింది...అది యిచ్చేదే నాలుగు చుక్కలు...ఆకాసినీఒలికిపోతే చేసేదేముందీ?'

'అందుచేత ఇవాళమానేశావా?'

'పోనీ తీయమంటేతీస్తాను.'

'నేను చూస్తూనేఉన్నాలే...పనంటే బద్ధకించి ఇన్ని వేషాలు పోతున్నావు...నీవుచేయకపోతే నీబాబెవరు చేస్తారనుకున్నావు?'

'ఇంతలోనే అంత చిరాకెందుకూ...అలవాటయితే నేనే తీస్తానుగా...పాలు వృధాగాపోతాయని ఊరుకున్నాను.'

'చేసినపనికి ఇంకా మెదలకుండా ఊరుకోక నీలుగుళ్ళేమంట!...తీయి...ఎలాతంతుందోచూస్తాను.'

'తన్నినతరువాత చేసేదేముంది?'

*   *   *   *

'భూషమ్మ గారింటికెందుకువెళ్లావు?'

'ఏమీ?'

'ఏంఏమిటి...ఎవర్నడిగివెళ్లావు?'

'...............'

'దాంతో నీకేంసావాసం: అదెల్లాటిదో నీకు తెలుసునా?'

'పోనీ వెళ్ళద్దంటే మానేస్తాను.'

'అసలు ఎందుకు వెళ్లావంట?'

'భూషమ్మకోడలిది మాఊరేకాదూ...ఆ సావాసాన వెళ్లాను.'

'అదా...అదోరంగులరాణి...దానికీనీకు ఏం స్నేహం?'

'మీకెవ్వరూ పనికిరారు...ఆఅమ్మాయి నేనూ చిన్నప్పటినుంచీ ఆడుకునేవాళ్ళం...చాలామంచిది. దానికే వంకబెడుతున్నారేం?'

'ఆదెల్లాటిదో తెలుసునా?'

'ఆఁ... తెలుసును...మీరు అక్కర్లేనిమాటలాడమోకండి.'

'దానిమీదఅభిమానం నామీదలేదేనీకు...నీకూ దానిలాగానే ఉండాలనిఉందాయేం?...మీఅమ్మ... నాయనా...ఇదేనా...నీకు చిన్నప్పటినుంచీ నేర్పింది...ఇంకనుంచి ఇల్లుకదిలావా అంటే చూసుకో.'

* * * *

'ఇంత సేపేంజేస్తున్నావు...పనిఉండిపిలిస్తే కలికానికన్నా కానరాకుండాపోతావేం?'

'నేనేంఆడుకుంటున్నానా?...భావికాడికి నీళ్ళు తేబోయినా.'

'భావేం పట్టుకువదలనందా?'

'లేదు...మరే...మీరు కోప్పడనంటే చెపుతా... సూరమ్మగారి సోమమ్మ మొగుడిని...పండుగకు తీసుకువచ్చారుట...చిన్నబ్బాయి మరదలేఁ...నన్నుకూడా రమ్మంది...చూసివద్దామంటే వెళ్ళాను.'

'ఏం చూశావు?...బాగున్నాడా?... [illegible] నచ్చాడా?'

'ఏమిటి?'

'లేకపోతే పరాయిమొగవాడిని ఏమనిచూడబోయినావు?...నీవు సానిదానివా?...ఓహో... హో. నాసంగతి తెలీనట్టు నీకింకా...ఊఁ.'

* * * *

కనకం కాపురానికివచ్చి రెండు నెలలైనది. ఎప్పటికబుర్లు అప్పుడు తెలుస్తున్నా...తండ్రయినా ఓమారు వచ్చి చూసిపోయినాడుకాదని చాలా అనుకుంటుండేది. పైగా ఎంతోదూరంకూడాలేదు...ఏలాగైనా తీరికచేసుకుని కావలంటే రానేవచ్చును...అయినా అప్పుడు పనిఉద్దడిరోజులుకావుకూడాను.

కనకానికి యింకా చాలాచిన్నతనం...అయిన యింటపుట్టినపిల్ల...పైగా తలిదండ్రులకు ఒక్కతే కూడానేమో...తగని గారాబాన...అటుచెంబిటు తీయ నవసరములేకుండా...పెరిగింది...పల్లెటిదిక్కన పుట్టినా...చిన్నప్పటినుంచీ పనిపాటులేమీ చేసి ఎరుగదు...ఎన్నడైనా...సరదాకు ఏ పని అయినా చేయవచ్చినా...తల్లి అడ్డంవచ్చి చేయనిచ్చేదికాదు. చిన్నతనమంతా చాలాచక్కగాగడిచిపోయింది ఆటపాటలతో...తండ్రిపోలికెపిల్ల...మాంచి అదృష్టమంతురాలవుతుందని అందరూఅనేవారు...చాలా అల్లరిపిల్ల...కనకం చిన్నప్పటినుంచీ...అయినా సౌమ్యశాలు...కులాసాకోసం...ఉబుసుపోక...సంతోషంగా అల్లరిచేయడమేకాని ఎన్నడూ ఎవరినీ నొప్పించిఎరుగదు...ఆఅల్లరయినా, అందరూచూసి హర్షించేటట్టుగానేఉండేది.

కనకానికి తండ్రిమీద చాలాప్రేమ—అప్పిరెడ్డికి కూడా కూతురంటే ప్రాణపదము—తల్లిదగ్గరకన్న అతనిదగ్గరే ఎక్కువచనువు...'అమ్మా! ఆడపిల్లయినది ఒకరిచేత వేలువంపించుకోకుండా...ఇటుపుట్టినయింటికీ అటుమెట్టినఇంటికీ పేరుతీసుకురావాలి...అందరిచేత అవుననిపించుకుని పన్నెవాసితో...చక్కగా కాపురంచేయాలి.' అని అప్పిరెడ్డి చిన్నప్పుడేఉపదేశం చేశాడు...తండ్రిమాటమీద లక్ష్యముంచి, ఒకరిచేత [illegible]ండా-మీద ఈగవాలనిచ్చేదికాదు...ఎవరన్నానోరుజారి ఏమన్నాఅంటే పీకిపాకంపట్టేది— ఆలాగే ఎవరినీ ఏమీఅనకుండా...చాలా చక్కగా పెరిగింది...కాపురానికివెళ్ళినతరువాతకూడా...ఇక ఎన్నటికైనా సరే. అంతే!

కనకానికి మగనిమీద తగనిఆపేక్ష. మేనత్త మేనమామబిడ్డలుకాకపోయినా, అంతకన్నా ఎక్కువగా కలిసిమెలిసిఉండేవారు...రామిరెడ్డికూడా...పరాయిసంబంధమైనాఏమీ ఎబ్బెట్టులేకుండా, వస్తూపోతూ, అత్తవారితో చాలాచనువుగాఉండేవాడు. స్వతఃమంచివాడుకూడాను...విశేషసంపన్నుఁడుకాక

పోయినా...అన్నవస్త్రాదులకు లోటులేకుండా జరిగిపోయేవసతిఉన్నది రామిరెడ్డికి...అయినా ఏది. వచ్చినా ఆదుకునేందుకు...పెద్దఅండ...మామగారున్నాడాయెను! చిన్నప్పటినుంచీ చాలామంచివాడే...పెద్దవాడై...తనవ్యవహారం తానుచూసుకోగల నేర్పువచ్చినతరువాతనూకూడా చాలామంచివాడే...కనకం కాపురానికివచ్చినతరువాతను కూడా ....కాని......

౪

రెండుఝాములవేళ.

కాలువగట్టువెంటనే మామిడితోపుదాకా వెళ్ళి పక్క 'సులోచీ'లోంచి అడ్డదోవను చింతలకోడుచ్చుకున్నది కనకం...రామిరెడ్డి పడమటచేలో గడ్డ విరిపిస్తున్నాడు...భోజనానికి యింటికిరానని కబురు పంపాడు...సమయానికి ఎవరూలేకపోవడంచేత కనకమే అన్నంపట్టుకు బయలుదేరింది.

దూరాన్నుంచేచూసి రామిరెడ్డి కాళ్లూచేతులూ కడుక్కుని, తుమ్మచెట్టునీడకు జేరుకున్నాడు. కనకం తానుతెచ్చినగిన్నెమూట అక్కడపెట్టి తానుకూడా కొంచెంఎడంగా కూర్చున్నది.

మంచి ఆకలిమీదున్నాడు. మూటవిప్పడం వ్యవధానంగా...పచ్చడిబద్దలుచూపెట్టుకుంటూ...గబగబ నాలుగుముద్దల్లో అన్నమంతా తినివేశాడు...కాలువలో చేయికడుక్కుని, రెండుదోసెళ్ళ మంచినీరు త్రావి...చుట్టచుట్టుకుంటూవచ్చికూర్చున్నాడు. కనకం...గిన్నె తొలిచి మూటకట్టుగుడ్డ ఝాడించి...మళ్ళా రామిరెడ్డిసమీపానికివచ్చింది.

'ఇక వెళ్ళనా?'

'కూచో కొంచెంఉండి వెళుదువుకాని...నేనూ ఇదికాల్చి మళ్ళాలేస్తాను.'

'కాదు వెళ్ళాలి...తోడు మాలెయటం మరచిపోయినాను...ఆలస్యమయితే యీకాలం సరిగా తోడుకోవు...లేగంటివికూడానాయెను...ఇంకా పనుంది...జొన్నలుదంపించాలి...మరి.'

'అయితేపో...మళ్ళాఇంతచుట్టెందుకూ...అయ్యవార్లంగారిచేలోంచి వెళ్ళరాదూ?'

'ఎంతమట్టూ?...అయినా...ఈలాగేవెళ్తా...మిరఫకాయలు కోసుకోవాలి.'

పదిబారలదూరాన మిరపచేనుంది. కనకం గట్టునే నిలుచుని పండుకాయలు తుంచుకుంటూంది.

'ఆఁ...—ఆఁ...'

కనకం అదిరిపడి వెనుదిరిగిచూసింది...—ఎంత సేపట్లోజరిగిందో...రెప్పపాటంత అవకాశంకూడా లేదేమో.

—పెద్దగిత్త, తలత్రాడు తెంచుకుని బెదిరి ఎగురుతూ...కనకంవైపుకు దూకుతూవస్తూంది...ఇంతలో...—ఏంజరిగిందో...రామిరెడ్డి క్రిందపడిపోయినాడు...గిత్త తీవ్రంగావిసిరివేసింది.

చుట్టుపక్క పనిచేస్తూన్నవాళ్ళందరూ పరుగెత్తుకునివచ్చారు...ఇద్దరు...ఆగిత్తనుపట్టుకుని ఆపేసారు. మిగతావారందరూ రామిరెడ్డిచుట్టూమూగారు.

ఎంతోసేపులేదు—కాని ఇంతజరిగింది.

చేష్టలుడిగి నిలువబడిపోయిందికనకం...తెలివి తెచ్చుకుని అక్కడకు పరుగెత్తుకునిపోయింది...అందరూ ఆమెనుచూసి ఓసరిల్లారు.

కొమ్ములతో కుమ్మేసిందేమో...వెన్నున ప్రమాదమైనగాయమైంది రామిరెడ్డికి...అంతా నెత్తురుమయము...ఆతడు స్పృహలేకుండా పడిపోయి ఉన్నాడు.

కనకం ముందరికివెళ్ళి...ఆతన్ని మెల్లిగా లేవనెత్తి...తలను...తొడమీద ఆన్చుకున్నది...ఇద్దరు ముగ్గురు...గాయం శుభ్రంగా...నెమ్మదిగా...కడిగి...లేతపసిరికనలిపి...అదంతా చక్కగాఅద్ది దానిమీద ఒండుమన్నుపూశారు...కొంతసేపటికి నెత్తురు కట్టుపడినది.

'దీన్ని తెగ్గొయ్యా...పనిలేక కొవ్వెక్కిఏడుస్తూంది రా...కాడికిందవిరగ్గొట్టాలి...మళ్ళా బుట్టెడుతవుడు తింటావు కదలవేం...అహాయ్...అహాయ్...నిన్ను

మాదిగాడుదిన!...' అని ఓ ఆసామి...కోలుతో గిత్తమక్కల్లోపొడిచాడు.

'ఎందుకురా అలాకొట్టుకుంటావు...నోరువాయా ఉండాదానికి?'

'అదికాదమ్మా...మేంచూస్తూనేఉన్నాం...నీవు మిరపచేనుకాడ ఆగావు చూడు. పైటేఁ జెండా లాగా గాలికి ఆడుతూంది...అప్పుడే నాగలివిప్పి వదిలాం...తొగరుచీరేమో...చూసిబెదిరింది...' అని జరిగినకథచెప్పాడు మరోఆతడు కనకానికి.

'...రామయ్యచూశాడు...మాకన్న దగ్గరున్నాడేమో...నీమీదకువస్తూందని ముందుకు ఉరికాడు...ఇంతకూఈవాళ ఎవరిమొగంచూసి లేచాడోకాని.'

కనకం ఏమీమాటాడలేదు...కాని కళ్ళవెంట జొటజొట నీళ్ళుకారుతున్నాయి...—గుండె పగిలేటట్టు దుఃఖిస్తూంది...లోపలనే.

'ఊరుకో అమ్మా!...వాడికేం భయంలేదులే...పడుచువాడు. ఈమాత్రం భరాయించుకోలేడాఏం...నెత్తురుకట్టిందాచూడు...ఇక నాలుగురోజుల్లో గాయం మానడుతుంది...నీవుతప్పుకో అమ్మ...ఒరేయ్...అల్లాగ్గా పడుకోపెట్టండిరా...నీవుకూడా ఎక్కి...కదలకుండాఉంటుంది...జాగ్రత్తగాపట్టుకు కూర్చో అమ్మ.'

* * * *

రాత్రి ఓప్రొద్దువేళకు రామిరెడ్డికి బాగా తెలివి వచ్చింది...ఎదుట కనకం కళ్ళనీరుకారుస్తూ కూర్చుని ఉంది...అతడు లేవబోయినాడు...కనకం ఆతురతతో వారించింది...ఆమె మొగంచూసేసరికి...ఆమె పడుతున్నవేదన అర్ధమయింది ఆతనికి. కళ్ళనీళ్ళు తిరిగినవి.

'ఎందుకు అడ్డంవెళ్ళారూ...' అని కన్నీరు బలవంతానఆపుకుంటూ ఏడుపువెక్కిళ్ళతోనే అడిగింది కనకం.

రామిరెడ్డి చాలానీరసంగా...మాటాడలేక...ఆమెవంక అదోమాదిరిచూసి నవ్వి ఊరుకున్నాడు.

'మీప్రాణంకన్న నేనుఎక్కువా?'

ఆతను తలఊగించాడు.

'నాకోసం...ఎందుకూ...మీరు...నామీద మీకు.'

కనకం ఇక శోకమాపలేక ఎలుగెత్తి ఆక్రోశించింది...రామిరెడ్డి తనరెండుచేతులలోకీ, ఆమెచేతిని తీసుకుని...కళ్ళు మూసుకున్నాడు...ఆతని కొలుకుల వెంబడే నీళ్ళుకారుతూనేఉన్నవి.

'ఏంచేస్తున్నావ్ ...అమ్మాయి!...కనకమ్మా!...ఎక్కడున్నావమ్మా?'

'వచ్చే...ఇదుగో వస్తున్నా...కూర్చో నాగమ్మత్తా!'

* * * *

'ఇంతసేపేం జేస్తున్నావే...మారామయ్యఏడీ...లోపలఉన్నాడా?'

'లేరు...ఇంతకుముందే తాశీలుకట్టిరావాలని వెళ్ళారు.'

'లేడుగద!...సరే'

'ఏం అత్తా!'

'ఏముందిలే...—ఆహాఁ...ఏంవిచిత్రం!...కాలమెల్లా మారుతూంది?'

'ఏమి టావిశేషం?'

'చూసినకొద్దీ వింతవేస్తూంది...ఇవాళ చూసిన వాళ్ళు రేపు తారుమారవుతున్నారు...ఏం చోద్యమొచ్చిందమ్మా!'

'చెపుదూఅత్తా!'

'ఏమోలేఅమ్మ...అయినా నాకెందుకుమధ్య...మీరూమీరూబాగుంటే అంతేచాలు.'

'అంటే?'

'అయితేమరి...నీవు రేపుపండుగకు మీవాళ్ళ యింటికివెళుతువా?'

'ఆఁ...'

'పోనీ మానేయరాదూ?'

'ఏం...ఆలాగంటావేం...అత్తా!'

'ఎందుకుచెప్పానో ఆలోచించుకో...నీవుఒక్కతవేవెళుతావా...మావాడుకూడా వస్తాడా?'

'రారు...ఇక్కడ పనితీరడంలేదు'

'అవును...ఓసి వెర్రిదానా?'

'ఏమీ?'

'నీవు ఇంకాగ్రహించలా...పని...ఏంపనిచేస్తున్నాడు...ఇంకా తెలియలా?'

'తెలియలేదులే...పోనిద్దూ.'

'అయితే నీకూయిష్టమేనా...ఇది మరీవిచిత్రంగా ఉంది.'

'అబ్బ! విసిగించక...చెపితేచెప్పుదూ...చూడు మరి...మాఆయనమీద నేరమైతే...అక్కర్లేదు.'

'నేరమేమిటి...నలుగురికీ తెలిసినసంగతి...కావాలంటే నీకు ఋజువుఇప్పించనా?'

'నీవు చెపుదూ చాలు.'

'ఏముంది?...నీకాపురం గంగపాలౌతూంది.'

'ఊఁ...'

'ఇంత అమాయకత్వమేమే పిచ్చిదానా!...అనూరమ్మ...ఆ...నీకాపురం నట్టేట్లోకలిపింది...ఇంకా తెలియలా...ఏమన్నా మందుపెట్టిందేమోకూడాను...వాళ్ళవంగసమంతా ఆలాటిదే...పొద్దస్తమానం వాళ్ళఇంటిదగ్గర నేపడిఉంటాడు...మరి నీవు ఏంచూస్తున్నావు?'

'పోనీ...ఆయనసంగతి నాకెందుకు?...ఆయనయిష్టం'

'అంతేనా...అయితే నిన్ను తిన్నగా చూస్తున్నాడా?'

కనకం నవ్వింది.

'ఆయనసంగతి నీకేంతెలుసుఅత్తా?'

'పోనీలే...ఊరుకో...మీఆయనవస్తున్నాడు...నేనుసెప్పినముక్కలుకూడా మనసులో ఓపక్కనుఉంచుకో...కాస్తకనిపెట్టిచూస్తూండు...ఇప్పుడు వెనుకటి రామయ్యకాదు...నీమీదప్రేమ...నీవేకావాలెననుకుంటూన్నావేమో...వట్టిది...నీవెందుకు ఆరంభముందర...నీవేమైతేనేం?'

నాగమ్మవెళ్ళిపోయింది...రామిరెడ్డి యింటికి వచ్చాడు...తిన్నగా లోపలికిరాక దొడ్లో పశువులను చూసుకుంటున్నాడు...కనకానికి వెనుదిరిగి ఉన్నాడు...వీపుమీద పెద్దమచ్చ కనబడుతూన్నది. ఆమె దానిని చాలాసేపుచూసి...'నేనేమైతేనేం...కాదూ?'...అని తనలోతాను నవ్వుకున్నది.

* * * *

సాయంకాలము.

'ఏంఅమ్మాయ్...ప్రొద్దునే బయలుదేరుదాము...సిద్ధముగాఉండు' అని కనకాన్ని హెచ్చరించి...అప్పిరెడ్డి ఊళ్ళోకివెళ్ళాడు.

—రామిరెడ్డి పైన పంచవేసుకుని ఎక్కడికో వెళ్ళబోతున్నాడుఅప్పుడే...ఇంతలో వాకిట బండీ వచ్చినిలిచింది...అప్పిరెడ్డి దిగాడు...మామగారు అడిగిందేతరువాయిగా రామిరెడ్డి కనకాన్ని పంపిస్తానన్నాడు—తానుమాత్రం రానన్నాడు...ఏవో పనులుండటంచేత...త్వరగా తిరిగివస్తానని బయటికి వెళ్ళిపోయినాడు.

బంతిపూవులు కోసుకుతెచ్చుకుందామని బయలుదేరింది కనకం...ఇంటికి దక్షిణంగా...సమీపంలోనే పంటకాలువ, పాయఉన్నది...దాని అవల గట్టున వాములదొడ్డి...అక్కడే కొంతఖాళీజాగాను బంతిమొక్కలున్నాయి.

తడికెనెట్టింది...కాని లోపలనుంచి కట్టేసిఉంది. బలంకొద్దిత్రోసేటప్పటికి తెగి తలుపువచ్చింది...తీసుకుని లోపలప్రవేశించి.

ముందుకువెళుతున్నదల్లా అక్కడే ఆగిపోయింది. బంతిచెట్లదగ్గర...రామిరెడ్డి...సూరమ్మ.

సూరమ్మఒడినిండా బంతిపూలున్నాయి...కనకాన్నిచూసి చూడనట్లుగానే...రామిరెడ్డితో...'ఇక చాలులేండి పూలు...'అని కనకంతో మాటాడకుండానే...సావకాశంగా వెళ్ళిపోయింది.

రామిరెడ్డి అంతవరకూ మెదలకుండా నిలుచుని ఉన్నాడు...సూరమ్మ వెళ్ళిపోగానే...ఉగ్రుడై...

'ఎందుకువచ్చావు?' అని ఉరిమినట్లు ప్రశ్నించాడు.

'ఏంలేదు...పూలుకావాలని.'

'అలాగేం?...నీవేషాలు నాకు తెలుసునులే.'

'ఏంవేషాలు?'

'ఇక్కడనుంచి వెళ్ళిపో.'

'కోసుకునివెళ్ళనీయండి.'

'నీబాబుసొమ్మిక్కడ దాచబెట్టావు...ఎవరితాత సొమ్ము?...నీవు ఎందుకువచ్చావు?'

ఎన్నడూ జరుగని పని జరిగింది.

రామిరెడ్డి కనకాన్ని చెంపమీదకొట్టాడు...దెబ్బకల్లా క్రిందపడిపోయింది ఆపిల్ల...అతడు అక్కడ నిలువలేదు...వెనుదిరిగిచూడకుండా యింటికి వచ్చేశాడు.

మరికొంతసేపటికి కనకంవచ్చింది...రామిరెడ్డి చాలా కలవరపడుతున్నాడు...కనకం అప్పిరెడ్డితో ఏంచెపుతుందోనని...ఆమెరాకడకనిపెట్టి పనిఉన్నవాడిలాగా లోపలికిపోయి...చాటుగా నిలుచుని ఉన్నాడు తండ్రితో ఏమిచెపుతుందో వినవలెనని.

అప్పిరెడ్డి...వాకిట్లోతిరుగుతూ చుట్టకాల్చుకుంటున్నాడు...కనకంరావడంచూసి...'ఏమేఅమ్మ...ఇంతసేపుచేశావ్...మనఊళ్ళో లేవూ కావాలిసినన్ని బంతిపూలు?...బంగారమా? వాటికోసరమై ఇప్పుడు వెళ్ళావు...'అని పలుకరించి...'అదేమమ్మ!...ఆచెంప అలా కందిపోయింది...ఏదీ ఇలారా...అబ్బో ఎంత వాచిందో...ఇదేమిటమ్మా!'

'దొడ్లో పడ్డాను నాన్నా!...ఈబుగ్గ కొంచెం కందింది...నొప్పిగాఉంది...తెల్లవారికి తగ్గుతుంది లే...'అని లోపలికివెళ్ళింది.

* * * *

ప్రయాణానికి వేళఅయినది.

రామిరెడ్డి నెమ్మదిగా మామగారిదగ్గరకువచ్చి...చాలావినయంగా...'మామా!...నీవు ఏమిఅనుకోవద్దు...కాని మీ అమ్మాయిని ఇప్పుడుపంపను...' అన్నాడు.

అప్పిరెడ్డి ఆశ్చర్యపడి...'ఏం...ఇంతలో మళ్ళా ఏమివచ్చింది?...రాత్రి పంపుతానంటివే...గడియలో మాటా?' అని కోపగించుకున్నాడు.

'నిజంగాచెప్పనా?...నేను...దాన్ని విడిచి ఉండలేను...ఎల్లాగోఉంటుంది. ఉంచిపోదూ.'

కనకం లోపలనుంచివచ్చింది...'నేనూ ఇప్పుడు రాను నాన్నా!...ఇవిగో ఈపూలు పట్టికెళ్ళి...లక్ష్మికి కొమ్ములోస్తున్నాయన్నావుకాదూ-దండకట్టి చుట్టించు...అమ్మతో చెప్పేం ఏం అనుకోవద్దని...ఆయన్ని ఒక్కడ్ని విడిచి రాలేక ఉండిపోయిందని చెప్పేం!.'

౬

శరత్కాలము...పండువెన్నెల.

ప్రొద్దుపోతూన్నది...అప్పటికప్పుడే ఊరంతా మాటుమణిగింది ఇంకా రామిరెడ్డి యింటికిరాలేదు...కనకం ఆతనికోసం ఎదురుచూస్తూ కూర్చునిఉన్నది..

దబదబ తలుపుచప్పడయినది...వచ్చాడనిగ్రహించి లేచివెళ్ళి తలుపుతీసింది...రామిరెడ్డి తూలుతూ లోపల ప్రవేశించాడు. కళ్ళు బాగా ఎర్రపారి ఉన్నాయి...ఒకచోట నిలువబడలేకుండాఉన్నాడు. ఇరాగంధబంధురమైన ఆతనిఊర్పులు.

—ఆమె కది పరిపాటిఅయిపోయినది...ఆతడు యీమాదిరిగానే రోజూ...ఒళ్ళుమరచి యింటికి వస్తూంటాడు...ఒళ్ళుమరచే.

ఆతడుతూలి ప్రక్కకుపడబోయినాడు...ఆ అమ్మాయి పట్టుకోబోయింది...కాని ఆమెను త్రోసివేసి...నెర్రిచూపులు చూస్తూ...'ఎవరొస్తారో రమ్మను..వీళ్ళబాబులంటివాళ్ళనుచూశాను..రమ్మను. దెబ్బకుసఫా...' అని పరపళ్ళుకొట్టడం మొదలుపెట్టాడు.

కనకం అంతాచూస్తూ ఊరకునిఉన్నది. కొంతసేపటికి ఉద్రేకంతగ్గింది. ఏలాగో నాలుగుమెతుకులుతినిపించి తాను తినకుండా ఆతన్ని కనిపెట్టుకుని ఉన్నది.

రామిరెడ్డికి ఓప్రొద్దువేళకు మత్తుతగ్గింది...అప్పుడు తెలివితెచ్చుకుని చూడగా...కనకం ఎదురుగాకూర్చుని ఉన్నది...'ఏం ఇంకా కూర్చున్నావేం?'అనిఅడిగాడు తాను మంచంమీదలేచికూర్చుని.

'ఏమీలేదు...ఇంకా నిద్రరాలేదు.'

'ఇప్పుడు ఎంతప్రొద్దోయింది?'

'ఏమో బాగాప్రొద్దోయింది అనుకుంటాను.'

'ఇక పడుకోరాదూ. అయితే నీవు అన్నం తిన్నావా?'

'............'

'ఎందుచేతమానేశావు—'

'............ ...'

'తిందూ!'

'నాకు ఆకలిలేదు'

'వల్లకాదు...ఆకలిలేకపోవడమేమిటి'?

ఆతనిబలవంతాన ఆమె భుజించింది...తిరిగివచ్చి ఆతనిసరసను కూర్చున్నది.

'నేనేమయినా కేకలువేశానా...వేశానుకాదు.'

కనకం నవ్వింది.

'ఏంజరిగిందనుకున్నావు...కామయ్యఉన్నాడే... సూరమ్మబావ...నన్ను దోవలోనిలవేశాడు...వాడికా నేనుజడిసేది?...వాడితాతలలాంటివాళ్ళను చూశాను... చేయిపట్టుకునేటప్పటికి కెక్కురుమన్నాడు... అక్కడే తందామనుకున్నాను...తప్పించుకుని పారిపోయినాడు.. ఎవరినితీసుకువస్తాడో తెమ్మను... విరిచేస్తాను.'

'ఎందుకు నిలవేశాడు?'

'ఇంట్లో ఆజ్ఞచెప్పలేదుకాని...నాకు బుద్ధిచెబుతాడూ?...వీడిసత్తా నేనెరుగనూ?'

'పోనీండి...వాడితో మీకెందుకు?.'

ఇద్దరూ మాట్లాడకుండాఊరుకున్నారు...కొంత సేపటికిరామిరెడ్డి కనకంవంక చూస్తూ...'నామీద... కోపమా నీకు?' అని అడిగాడు.

కనకం నవ్వి ఆతని మెడను చేతులు పెనవేసింది... రామిరెడ్డి ఆమెను కౌగిలించుకున్నాడు.

విరిగిపోయేటట్టు తలుపుమీద తాపులుతగిలినవి. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు...రామిరెడ్డి ఓనిమిషం నిదానించి...వెంటనేలేచి కర్రతీసుకుని 'వాళ్ళే—' అన్నాడు. కనకం ఆతనివేపేచూస్తూంది.

'నీవు లోపలికివెళ్ళి తలుపువేసుకో...నేనున్నానుగా...అందరినీ భాగవతమాడిస్తాను...ఊహూ... ఈకర్రకాదు...గాదెప్రక్కను...'అని ఆతడు లోపలికి వెళ్ళిపోయినాడు.

...కనకానికి అంతా తెలుసును...చాలారోజుల నుంచీ చూచాయగావింటూన్నది...సూరమ్మకీ ఆతనికీ స్నేహమని, ఆతన్ని చంపివేయాలనిచూస్తున్నారని, అందుకోసరమే వచ్చారనీవాళ్ళు. ఎంతపరాక్రమమున్నా ఇంతమందినిఏలా ఒక్కడు ఎదిరించగలడు?

రామిరెడ్డి కర్రతీసుకునివస్తూన్నాడు...రెండడుగులు వేసేటప్పటికల్లా హడలిపోయేటట్టు పెద్దకేక... ఎవరోపడినట్టు చప్పుడూవినిపించిలోపలికి.

ముందుకుదూకాడు. తలుపు తెరిచిఉన్నది. గుమ్మం ముందర కనకం. రామిరెడ్డికి కళ్ళుతిరిగిపోయినవి.

అంతా నెత్తురుమయం...కనకంపడిపోయిఉన్నది. చుట్టుపక్కల ఎవరూలేరు. తల పగిలిపోయింది.

రామిరెడ్డి నెమ్మదిగా ఆమెను లేవనెత్తి తన కానించుకున్నాడు...ఊపిరిఉన్నదో, లేదో. కనకం కళ్ళు తెరిచింది. చేత్తో ఆతనివీపుమీదిమచ్చను నిమురుతూ 'అవాళ...'అని కన్నులుమూసుకున్నది.

ఆశరీరాన్ని లోపలికితీసుకువెళ్ళి పండుకోబెట్టినాడు...కంటివెంట నీటిచుక్కయినా రాలలేదు.

కఱ్ఱతీసుకునిబయలుదేరి...పేరుపేరువరుసనూపిలిచి కొట్టేశాడు...అందరూ కనకానికి తోడుగాపోయినారు...ఒక్కడూలేవలేదు...శత్రువులందరూ నిర్మూలమయినారు. ...మరిరెండురోజులకి రామిరెడ్డి కాలువకుఎగువను లాకులదగ్గర తేలాడు.

* * * *

ఏముసలమ్మయినా, ఆత్రోవను వెళుతూ...వాళ్ళ ఇంటివేపుచూసి...'అయ్యో!నాతల్లీ!'...అని తనలో తాననుకుని నిట్టూర్పువిడిచేది.